సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

నార్నూర్ మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

నార్నూర్, ఫిబ్రవరి 11: సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పైలెట్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణికి మండలంలోని మారుమూల గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. పింఛన్, గ్యాస్ సబ్సిడీ, రేషన్ కార్డు తొలగింపు, కొత్త రేషన్‌కార్డు, రుణమాఫీ కాలేదంటూ సమస్యలతో బాధితు లు అర్జీలు పెట్టుకున్నారు. నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఇబ్బంది పడకుండా సమస్యలు పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఇక్కడ తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో జవహర్ లాల్, అధికారులున్నారు.

శారీరక ధృడత్వానికి క్రీడలు దోహదం

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి

ఎదులాపురం, ఫిబ్రవరి 11: శారీరక ధృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 2వ ఖేలో ఇండియాలో భాగంగా అథ్లెటిక్స్ ప్రైవేట్ స్కూల్ చాంపియన్ షిప్ నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఆటల పోటీల్లో జాతీయ స్థాయి రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్ కార్యదర్శి కాంతారావు, అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రాజేశ్, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి నన్నెపు స్వామి. వీజీఎస్ అకాడమీ నిర్వాహకులు రాకేశ్, గుడి మహేశ్, ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

నంబర్ ప్లేట్ లేని వాహనాన్ని సీజ్ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్

ఎదులాపురం,ఫిబ్రవరి11: నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చౌక్‌లో సంబర్ ప్లేట్స్ లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేస్తూ పత్రాలు పరిశీలించారు. నంబర్ ప్లేట్స్ లేని వాహనాలు సీజ్ చేసి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 40 వాహనాలను పట్టుకున్నామన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంట కానిస్టేబుళ్లు ఉన్నారు.

డీఎస్సీ-2024 అభ్యర్థులతో సచివాలయాన్ని ముటడిస్తాం

- తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రజ్ఞశీల్

మాట్లాడుతున్న తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రజ్ఞశీల్

ఎదులాపురం, ఫిబ్రవరి 11: డీఎస్సీ-2024 అభ్యర్థులతో సచివాలయాన్ని ముటడిస్తామని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్ డిమాండ్ చేశారు. తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఉపాధ్యాయ నియామకాల్లో ఫేక్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే దళిత ఆదివాసీ విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు, 2024 డీఎస్సీ అభ్యర్థులతో కలిసి రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలోఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడాం జంగుదేవ్ పటేల్, టీఎస్ఎస్‌వో జిల్లా అధ్యక్షుడు జాడి వెంకటేశ్ నేత, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంగం దీపక్ కుమార్, నాయకులు ఆత్రం ఉపేంద్ర, కోటేశ్, తుకారాం, మోతీరం పాల్గొన్నారు.

భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్, ఫిబ్రవరి 11: ఏజెన్సీలో భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, చట్టాలకు విరుద్ధంగా భూ విక్రయాలు నిలిపివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మాకి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్స్‌రోడ్ చీమానాయక్‌తండా శివారులో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెం.79లో, పెరకగూడలోని ప్రభుత్వ భూమిని ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కలిసికట్టుగా గిరిజనేతరులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సర్వే నం.79లో కుమ్రం భీం ఆదివాసీ భవన్ నిర్మాణం కోసం కేటాయించాలన్నారు. అలాగే శ్యాంపూర్‌లో పీహెచ్‌సీ కోసం కేటాయించిన సర్వే నెం.145లో 32గుంటల ప్రభుత్వ ఖాళీ స్థలంలో గిరిజనేరుతులు మట్టివేసి చదును చేసినట్లు తెలిపారు. ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని వారు కోరారు. ఈయన వెంట నాయకులు కుమ్రం జైతు, అర్కా ఓమేశ్ ఉన్నారు.

రైతులకు అన్యాయం చేస్తున్న కేంద్రం

ఎదులాపురం, ఫిబ్రవరి 11 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు చట్టాలను తీసుకువచ్చి వారికి అన్యాయం చేస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. దీనికి ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కాగా సంఘ బలోపేతం, మండల, జిల్లా, రాష్ట్ర మహా సభలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గోవర్ధన్, సిర్ర దేవేందర్, సహాయ కార్యదర్శి కాంతరావ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజెంగుల రాజు, ఎండీ ఖాసీం, గంగయ్య, రుక్మిణి, రమేశ్, ఉస్మాన్ తదితరులున్నారు.

మహిళలు వ్యాపారంలో రాణించాలి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 11 : మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మిల్లెట్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు వ్యాపార రంగంలో రాణించడం ద్వారా కుటుంబాలు ఆర్థికంగా బాగా రాణిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈడీఐఐ ప్రాజెక్ట్ అధికారి భూపతి, కోఆర్డినేటర్ రవి, మాస్టర్ ట్రేనర్ అలేఖ్య, దేవేందర్, నాయకులు బిట్లింగ్ రజినీకాంత్, రాము, మహిళలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలందేనా..!

- మండల స్థాయి ప్రజావాణిపై కరువైన అవగాహన
- ఆందోళనలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు

బహిరంగ విచారణ వేదికలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

తాంసి, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పైలెట్ ప్రజావాణి -ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా బహిరంగ విచారణ వేదిక మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి ప్రజలు వారి సమస్యలను అధికారులకు వివరించి వినతి పత్రాలు అందించగా అర్హులకు సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలాగానే మారాయి. ఒకవైపు అధికారులకు దరఖాస్తులు వినతి పత్రాలు సమర్పిస్తూ మరోవైపు గ్యాస్ సబ్సిడీ రావడం లేదని, వితంతు ఆసరా పింఛన్లు అందడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన, ప్రజా ఫిర్యాదుల విభాగాల్లో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా గ్యాస్ సబ్సిడీ పడడం లేదని వాపోయారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని ఏడాది గడిచినా అర్హులకు ఆసరా పింఛన్లు అందడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

గ్యాస్ సబ్సిడీ, ఆసరా పింఛన్‌లు అందడం లేదని అంటున్నర్న మహిళలు, బాధితులు

వెంటనే రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పింఛన్లు అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి వెంకటరమణ, ఆర్డీవో వినోద్‌కుమార్, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎమ్మార్వో లక్ష్మి, వ్యవసాయ అధికారి రవీందర్, ఎంపీవో లింగయ్య, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవగాహన లేక తప్పని అవస్థలు

పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాను ఎంపికైనప్పటికీ ప్రజావాణిపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడంతో ఎక్కడ ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత శనివారం కప్పర్ల గ్రామంలో ప్రజావాణిపై దరఖాస్తులు స్వీకరించారు. పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారంతా ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఫిర్యాదులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి దరఖాస్తు చేసుకున్న పత్రాన్ని తీసుకొని రావాలని చెప్పినప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. దాదాపుగా ఎక్కువ శాతం గ్యాస్ సబ్సిడీ రావడం లేదంటూ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే వాటికి సంబంధించిన పత్రాలను తీసుకొని రావాలని చెప్పకపోవడంతో మండల ప్రజావాణికి వారు సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరుత్సాహంతో వెనుదిరగడం గమనార్హం.

ఇంకా ఎన్నిసార్లు కాగితాలియ్యాలి

పింఛన్ కోసం ఇయ్యాలటిదాక పదిసార్లు సార్లకు కాగితాలు ఇచ్చిన. ఇంకా ఎన్నిసార్లు ఆఫీస్‌ల చుట్టూ తిరగాలి. మా ఆయన సచ్చిపోయి రెండేళ్లు దాటింది. ఇగ పింఛన్ కోసం తిరిగి తిరిగి అలసిపోయిన. వస్తదో రాదో అనుకుని ప్రజావాణిలో కలెక్టర్ సార్‌కు కాగితాలిచ్చి నాలుగు నెలలు అయినా మండల సార్లు పట్టించుకుంటలేరు. ఇయ్యాల పింఛన్ కాగితాలు ఇస్తాలే మోనని మండలానికి వొచ్చిన కానీ ఏం ఇయ్యలే.. ఎట్లయినా జల్లి పింఛన్ కాగితాలు ఇయ్యాలి. ఇంకా ఎన్నిసార్లు కాగితాలు ఇయ్యాల్నో తెలుస్తలేదు.

- కీర్తి సుశీల, వృద్ధురాలు, పొన్నారి

నా భర్త చనిపోయినా ఇస్తలే..

మాది తాంసి మండలం పొన్నారి గ్రామం. నా భర్త మేకల భూమన్న చనిపోయి నాలుగేళ్లు అయ్యింది. ప్రజాపాలనలో వితంతు పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకున్న.. కానీ, పింఛన్ ఇత్తలేరు. మండలం చుట్టూ తిరిగవట్టి ఏడాదయ్యింది. ఏం జేయాలో తెలుస్తలేదు. ఆ దేవుని మీదనే భారం వేసిన. పింఛన్ ఇయ్యాలని సీఎం రేవంత్‌రెడ్డికి దండం పెట్టి కోరుతున్న. ఎట్లయినా ఫించన్ ఇయ్యాలి. అట్లయితేనే మా బతుకు ఎళ్తది.

- మేకల లక్ష్మి, వితంతువు, పొన్నారి, తాంసి

రంగనాథన్‌పై దాడి అమానుషం

భీంపూర్, ఫిబ్రవరి11: చిలుకూరి వేంకటేశ్వరాలయ ప్రధానార్చకులు రంగనాథన్‌పై దాడి అమానుష చర్య అని వైష్ణవసేవా సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేదాంతాచార్యులు, నేరెళ్ల రంగాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం జేశారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మెరుగైన వైద్యమందించాలి

దిలావర్‌పూర్ ఫిబ్రవరి 11 : ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య మందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అస్పతికి వచ్చే రోగులతో కాసేపు మాట్లాడారు. అనంతరం ఓపీ వివరాలు స్థానిక వైద్యురాలిని అడిగి తెలుసుకున్నారు. దవాఖానలోని మందులు పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానలో మెరుగైన, నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని సూచించారు. ఆయన వెంట వైద్యురాలు ప్రియాంక, సిబ్బంది ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కడెం, ఫిబ్రవరి 11: మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామ పంచాయతీ ఆవరణలో క్యాథలిక్ చర్చ్ సమీపంలో మంగళవారం పెద్దబెల్లాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు కడెం, దస్తురాబాద్, జన్నారం, ఖానాపూర్, పెంబి, రాయికల్, మల్లాపూర్, మెట్‌పెల్లి, జగిత్యాల మండలాల నుంచి పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి 10 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ నాయకులు తోట రాజేశ్వర్, పాకనాటి రాజేందర్, హిమాయత్ అలీ, ప్రశాంత్, రాజేందర్, బత్తుల రవీందర్, కిట్టు, తదితరులున్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 11 : విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణి విద్యార్థులకు సూచించారు. టీ-సాట్ చానల్లో ప్రసారమవుతున్న కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో డీఈవో రామారావు విద్యార్థులతో కలిసి వీక్షించారు. పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డ్ సహాయ కార్యదర్శి భానుమూర్తి , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

సీడీపీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి,11: నిర్మల్ సీడీపీవో కార్యాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి సంక్షేమాధికారి ఫైజాన్ అహ్మద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. అనంతరం సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతర పర్యవేక్షించాలన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

ఆరు గ్యారెంటీలపై 20న చలో హైదరాబాద్

కడెంలో పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కడెం, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఫిబ్రవరి 20న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. మంగళవారం కడెం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలని, ఆరు గ్యారంటీలతో పాటు, ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, నాయకులు గోనె స్వామి, ప్రసాద్, రాముల, రాజేశ్, నరేశ్, తదితరులున్నారు.

రంజీ ప్లేయర్ హిమతేజకు ఘన సన్మానం

ఎదులాపురం, ఫిబ్రవరి 11 : ఆదిలాబాద్ జిల్లా నుంచి మొట్టమొదటి క్రికెట్ క్రీడాకారుడిగా రంజీ స్థాయిలో రాణిస్తున్న కొడిమెల హిమ తేజను ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా హెచ్‌సీఏ అకాడమీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఇందిర ప్రియదర్శిని స్టేడియంలో అభినందన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కొడిమెల హిమ తేజ పాల్గొన్నారు. హెచ్‌సీఏ హెడ్ కోచ్ అత్తరుల్లా, కోచ్ విజయ్ అతడిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఆదిలాబాద్ హెచ్‌సీఏ క్యాప్‌లో శిక్షణ పొందుతున్న ప్రతి క్రీడాకారుడు హిమ తేజ నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. మొదటిసారిసారి ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి హిమ తేజ ఉన్నత స్థాయి రికార్డ్ క్రీడాకారుడిగా రాణించడం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. హిమ తేజ మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాలో క్రీడాకారులకు టర్ఫ్ పిచ్ అవకాశాలు అధికంగా కల్పించాలని, ప్రతి క్రీడాకారుడు కృషి పట్టుదలతో సాధన చేస్తేనే విజయాన్ని సాధించగలరని పేర్కొన్నారు. కొడిమెల వేణు, హెడ్ కోచ్ అత్తరుల్లా, కోచ్ విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సోన్, ఫిబ్రవరి 11 : మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం షీ టీం, భరోసా టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆపద సమయంలో 100కు డయల్ చేస్తే వెంటనే ఆపద సమయంలో పోలీసులు వచ్చి కాపాడుతారని తెలిపారు. ఇక్కడ షీటీం, భరోసా టీం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

పాఠశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

దిలావర్‌పూర్ ఫిబ్రవరి 11 : గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. అనంతరం ప్రభుత్వ దవాఖాన వెనుక పెరిగిన పిచ్చి మొక్కలు తొలగింపజేశారు. ఇక్కడ ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

భైంసా టౌన్, ఫిబ్రవరి 11: మండలంలోని వాలేగాంకు చెందిన పల్లపు నర్సయ్య (45) సోమవారం సాయంత్రం మాటేగాం శివారులోని చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లి నీటిలో పడి చనిపోయాడు. నర్సయ్య రాత్రంతా ఇంటికి రాకపోయేసరికి అనుమానం వచ్చిన కుటుంబీకులు మంగళవారం చెక్‌డ్యాంకు వద్దకు వచ్చి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభించింది. లోతు ఎక్కువగా ఉన్న నీటిలో పడిపోవడంతో మరణించినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మాలిక్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 11: జిల్లాలోని ఇంటర్ ఆపైన చదువుతున్న పోస్ట్ మెట్రిక్ ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాల మంజూరు కోసం ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఎస్సీ డీవో భగత్ సునీత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యూవల్, ఫ్రెష్ పోస్ట్‌మెట్రిక్‌లో విద్యార్థులు 31 మార్చి వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపకార వేతనాలకు అవసరమైన అన్ని ధృవ పత్రాలు జతపరిచి సంబంధిత కళాశాల యాజమాన్యాలు దరఖాస్తులు పరిశీలించాలన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన ఉండాలి

- డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద

ఇంద్రవెల్లి : అవగాహనలో డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి11 : మహిళల రక్షణ కోసం ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన ఉండాలని డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. మంగళవారం మండలంలోని పిట్టబొంగురం పీహెచ్‌సీలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రక్షణ చట్టాలపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం కల్పించిన చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. మహిళలపై జరుగుతున్న వేధింపులతో పాటు అన్యాయాలను నివారించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సఖీ కేంద్రం అందిస్తున్న సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది లావణ్య, కోటేశ్వర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సమానంగా చూడాలి

దస్తురాబాద్,ఫిబ్రవరి 11 : సమాజంలో మహిళలను పురుషులతో సమానంగా చూడాలని మహిళా సాధికారత కేంద్రం జనరల్ స్పెషలిస్టులు అన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనరల్ స్పెషలిస్టులు జ్యోతి, మౌనిక, శైలజ, పద్మావతి, ఎస్‌వో తిరుమల, హెచ్ఎం చందులాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లున్నారు.

నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

తానూర్, ఫిబ్రవరి 11 : గ్రామాల్లోని నర్సరీలపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండాకాలం నేపథ్యంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ సుధాకర్, మండలాభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్, ఎంపీవో నసురొద్దీన్, ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు తనిఖీ చేసిన అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 11: జిల్లాలోని పలు రేషన్ దుకాణాలను జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీ చేశారు. లక్ష్మణచాంద, ఖానాపూర్, సోన్, నిర్మల్ గ్రామీణ మండలాల్లోని రేషన్ దుకాణాలను మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిర్ణీత సమయాల్లో రేషన్ దుకాణాలను తప్పనిసరిగా తెరిచి ఉంచాలన్నారు. నిబంధనలు పాటించని రేషన్ డీలర్లపై కఠిన చర్యలుంటాయన్నారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి, అధికారులు శేఖర్ రెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, సుదర్శన్ రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు కార్తీక్ రెడ్డి, రంజిత్, తదితరులున్నారు.

బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి11 : మండలంలోని గౌరాపూర్, ధనోరా(బీ)గ్రామాల్లో అక్రమంగా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుబ్బాక సునీల్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని మోహన్‌సింగ్ తండా గ్రామానికి చెందిన సాబ్లే ఓమ్‌కార్ మండలంలోని గౌరాపూర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన బెల్ట్ షాపుపై దాడిచేసి రూ.7వేల380 విలువైన మద్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలోని ధనోరా(బీ)గ్రామంలో చోలే దత్తా అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపుపై దాడి చేయగా రూ.10,600 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

కుష్టు వ్యాధిపై అపోహలు వీడాలి

నార్నూర్,ఫిబ్రవరి11: కుష్టు వ్యాధిపై అపోహలు వీడాలని జిల్లా కుష్టు నివారణ విభాగం అధికారి సాగర్ అన్నారు. మండలంలోని ఎంపల్లి గ్రామంలో కుష్టు వ్యాధి నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా